క్లుప్తంగా

15 వరకూ బీమాకు గడువు

మధురపూడి: జీడిమామిడి బీమా యోజన పథకానికి ఈ నెల 15వ తేదీతో గడువు ముగిస్తున్నట్టు ఆ శాఖ అధికారి రినీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ పథకంలో రైతులు ఈ– కేవైసీలో నమోదు చేసుకోవాలన్నారు. వాతావరణ ఆధారిత బీమా పథకంలో భాగంగా పంటనష్టం జరిగినప్పుడు బీమా వర్తిస్తుందన్నారు. పూర్తి వివరాల కోసం రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏ, వీహెచ్ఏలను సంప్రదించాలన్నారు.

250 మందికి వైద్యసేవలు


శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

సీతానగరం: గ్రామంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ యన్నమని రామచంద్రరావు (ఎన్ఆర్ఐ), డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ సత్యం రమేష్‌బాబు 250 మందికి వైద్య సేవలు అందించారు. శ్రీరామకృష్ణ మఠం శిబిరంలో 192 మందికి, పరమహంస యోగానంద కంటి శిబిరంలో 58 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, చంటిబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: గ్రామంలోని సచివాలయం -2లో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 178 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. వైద్య పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాలని జాగ్రత్తలను వివరించారు. పీహెచ్‌సీలో పాము, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప, ఏఎన్ఎంలు సలీమా, సంధ్య, ఆశా వర్కర్లు కుమారి, జ్యోతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలోని 11 కేవీ ఫీడర్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రాజానగరం, సూర్యారావుపేట, తూర్పుగానుగూడెం, జీఎస్ఎల్, నన్నయ వర్సిటీ, గైట్ కాంప్లెక్స్, చక్రద్వారబంధం, వెలుగుబంద, నరేంద్రపురం గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

నిడిగట్లలో రెవెన్యూ సభ

మధురపూడి: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సభలను నిర్వహిస్తున్నట్టు కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం అన్నారు. కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో సోమవారం రెవెన్యూ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చటి పంటలతో కళకళలాడాల్సిన భూములు వివాదాలతో నిర్జీవంగా ఉంటున్నాయన్నారు. ఈ సందర్భంగా పలువురు భూ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు.

నేడు పీడీఎస్‌యూ సభ

మధురపూడి: విజయవాడ క్రీస్తురాజపురంలోని ఎంబీవీకే భవన్‌లో మంగళవారం పీడీఎస్‌యూ సభ జరుగుతుందని ఆ సంస్థ మాజీ నాయకుడు జె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. సంస్థలో పనిచేసిన పూర్వపు నాయకులందరూ పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

దివాన్ చెరువులో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటిలోని 16 గ్రాముల బంగారం, నగదును దొంగలు చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే.. దివాన్ చెరువులోని సాయి దుర్గానగర్‌కు చెందిన మనోజ్ సూర్యారెడ్డి కోయంబత్తూర్ జేకే ఫుడ్స్‌లో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఉద్యోగం నిమిత్తం గత నెల 23వ తేదీన క్యాంపునకు వెళ్లారు. ఆయన భార్య మంజుల పుట్టింటికి వెళ్లింది. తిరిగి ఈ నెల 3వ తేదీన ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని 16 గ్రాముల విలువైన బంగారు వస్తువులు, కొంత నగదు కనిపించలేదు. ఈ మేరకు మనోజ్ సూర్యారెడ్డి సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రియా కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7, 8 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

కంబాలచెరువు: 'జీవ–ఆధారిత పర్యావరణం కోసం సుస్థిరమైన భూభాగంపై' అనే అంశంపై స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 7, 8 తేదీలలో అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- మెట్ట ప్రాంతంలో పెరుగుతున్న విస్తీర్ణం
- పట్టణాలకు ఎగుమతులు
- రాయితీలు కల్పించాలని రైతుల వినతి


రంగంపేటలో బెండ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు


పామాయిల్ తోటలో అంతర పంటగా వంగ తోట

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో ఒకప్పుడు వరి, పత్తి, పొగాకు వంటి పంటలపై ఆధార పడిన రైతులు ఇప్పుడు లాభాలు ఆర్జించే పంటలపై మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో అతివష్టి, అనావష్టి, తుఫాన్‌ల కారణంగా వరి, పత్తి, మినుము పంటలతో రైతులు నష్ట పోవడం పరిపాటిగా మారింది. దీంతో నష్టాన్ని చవిచూసే పంటలకు ప్రత్యామ్నాయంగా కూరగాయల పంటలపై మక్కువ పెంచుకుంటున్నారు. ఫలితంగా మండల పరిధిలోని రంగంపేట, వడిశలేరు, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, వెంకటాపురం, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి, దొడ్డిగుంట, సుభద్రంపేట, ముకుందవరం, దొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను తదితర గ్రామాలలో కూరగాయల పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

సాగుకు రైతన్నల మొగ్గు

ఒకప్పుడు పొలం గట్లకే పరిమితమైన కూరగాయల పంటలు ఇప్పుడు మండలంలో 156 ఎకరాలకు చేరుకుంది. పెట్టుబడి ఎక్కువైనా నష్టం పెద్దగా ఉండదనే నమ్మకంతో రైతులు కూరగాయల పంటల సాగును ఎంచుకుంటున్నారు. పండించిన కూరగాయలను స్థానికంగా అమ్ముకోవడమే కాకుండా పట్టణాలకు తరలించి, విక్రయించి లాభాలు పొందుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. అధిక వర్షాలతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల దిగుమతులు తగ్గిపోవడంతో స్థానికంగా పండించే పంటలకు మంచి గిరాకీ ఏర్పడుతుంది. దీంతో ధర గిట్టుబాటు గానే ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు బదులుగా కూరగాయలు, ఉద్యాన పంటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మండలంలో ఎక్కువగా బీర, బెండ, దొండ, ఆనప, మిరప, వంగ, చిక్కుడు, గోరు చిక్కుడు, కాకర, గుమ్మడి, కర్రపెండలం తదితర కూరగాయల పంటలతో పాటు ఆకు కూరలైన తోటకూర, గోంగూర, పాలకూరలు సాగు చేస్తున్నారు. కూరగాయల సాగుకు ఎకరాకి సుమారు రూ.50 వేల నుంచి రూ.1లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. వీటికి ఎటువంటి తెగుళ్లు వ్యాపించకుండా ఉంటే ఎకరానికి అంతే మొత్తంలో లాభాలు వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ ధరలను బట్టి లాభాలు మారతాయని రైతులు చెబుతున్నారు.

విత్తనాలు సరఫరా చేయాలి



వరి పంటలో ఆశించినంత లాభం ఉండటం లేదు. వాతావరణ పరిస్థితులు, అతివృష్టి, అనావృష్టి తదితర కారణాలతో ఖరీఫ్‌లో వరి సాగులో తీవ్రంగా నష్ట పోతున్నాం. అందుకే దీనికి బదులుగా ఎకరా విస్తీర్ణంలో కూరగాయల సాగు చేస్తున్నాను. ప్రభుత్వం కూరగాయల పంటకు రాయితీ ఇవ్వాలి. విత్తనాలు సరఫరా చేయాలి.

– పాలేటి వెంకన్నబాబు, రైతు, సింగంపల్లి

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



రెండున్నర ఎకరాల భూమిలో బీర, బెండ సాగు చేస్తున్నాను. పండించిన కూరగాయలకు ప్రభుత్వం మార్కెటింగ్ కల్పించినట్లయితే కూరగాయల సాగు దారులకు సౌలభ్యంగా ఉంటుంది.
వరి పంట మాదిరి గానే కూరగాయల సాగుకు సైతం ప్రభుత్వం రాయితీ అందించాలి.

– బత్తుల సాయికృష్ణ, రైతు, దొడ్డిగుంట

కూరగాయల పంటలకు రాయితీలు



కూరగాయల పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోంది. హైబ్రిడ్ విత్తనాలపై హెక్టారుకు రూ.3 వేల చొప్పున రైతులకు రాయితీ అందించడం జరుగుతుంది. తీగజాతి కూరగాయలైన బీర, ఆనప, కాకర, పొట్లకాయ, కీరదోశ, దొండ తదితర కూరగాయల పంటల శాశ్వత పందిర్లకు గానూ ఎకరాకు రూ.1లక్ష వరకు రాయితీ వస్తుంది.

– కె.దివ్యశ్రీ, ఉద్యాన అధికారి, రంగంపేట

ఘనంగా మహా కుంభాభిషేకం


అమ్మవారికి కుంభాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో కొలువైన శ్రీ గౌరమ్మ తల్లి ఆలయం వద్ద మహా కుంభాభిషేకాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయం వద్ద ఐదేళ్లకు ఒకసారి జరిగే అమ్మవారి జాతరను పురస్కరించుకొని అమ్మవారికి మహా కుంభాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులే కాక చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వివిధ సమస్యలపై అర్జీల అందజేత

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలువురు అర్జీలు అందజేశారు. సీతానగరంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన బ్రాందీ షాపును వేరే ప్రాంతానికి తరలించాలని గ్రామానికి చెందిన బైర్రాజు మురళీ ఫిర్యాదు చేశారు. ఇంటి పన్నును తన కుమారుల పేరు మీద మార్చాలని ముగ్గళ్లకు చెందని టి.దుర్గ, తమ ప్రాంతానికి పంచాయతీ నీరు రావడం లేదని రఘుదేవపురానికి చెందిన వి.కృష్ణారావు ఫిర్యాదు చేశారు. కోరుకొండ మండలం బూరుగుపూడికి చెందిన జి.రత్నం తనకు సీతానగరంలో ఉన్న 4.3 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని, తన భూమి అప్పగించాలని అర్జీని అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పంటల బీమాను వినియోగించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి దివ్యశ్రీ

రాజానగరం: పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ మండల అధికారి కె.దివ్యశ్రీ అన్నారు. రబీ సీజన్ 2024 – 25 జీడిమామిడి పంట బీమా పథకంపై సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో రాజానగరం, రంగంపేట మండలాలకు చెందిన ఉద్యాన, వ్యవసాయ గ్రామ సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా అమలవుతున్న ఈ పథకం ద్వారా ఖరీఫ్‌లో అరటి, రబీలో జీడిమామిడి పంటలకు బీమా సదుపాయం కల్పించారన్నారు. ఈ నెల ఒకటి నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం వాటిల్లితే ఏపీఎస్‌డీపీఎస్ ఇచ్చే నివేదికను అనుసరించి పంటల బీమా వర్తిస్తుందన్నారు. జిల్లాలో జీడిమామిడి పంటలకు బీమా చేసేందుకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేశారన్నారు. మూడేళ్లు దాటిన జీడిమామిడి పంటలకు ఎకరాకు రూ.1500 బీమా ప్రీమియం చెల్లిస్తే, రైతులు చెల్లిస్తే, రూ.30 వేల బీమా వర్తిస్తుందన్నారు. కస్టమర్ సర్వీస్ సెంటర్లు, బ్యాంకులు, ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. దీనిపై రైతులకు సదస్సులు నిర్వహించి, బీమాపై ఆసక్తి ఉన్నవారికి ఈ నెల 6లోగా నమోదు చేయాలని గ్రామ సహాయకులకు సూచించారు. ఇఫ్కో జిల్లా కో ఆర్డినేటర్ ఎన్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆసక్తి ఉన్న రైతులు నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ (ఎన్‌సీఐపీ)లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఆ విధానాన్ని వ్యవసాయ, ఉద్యాన విభాగాల గ్రామ సహాయకులు వివరిస్తారని, లేకుంటే 92900 33325కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, కూటమి నాయకులు నీలపాల అరవరాజు, కుర్రే నాగబాబు, పిడుగు సురేష్ పాల్గొన్నారు.

మద్యం షాపును తరలించాలంటూ ధర్నా


సీతానగరం ఎంపీడీవో భారతికి సమస్యను వివరిస్తున్న మహిళలు

సీతానగరం: గ్రామంలో మెయిన్ రోడ్డును ఆనుకుని జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలంటూ సోమవారం మహిళలు నిరసన తెలిపారు. ముందుగా బైర్రాజు రాజ్యలక్ష్మి, సుబ్బలక్ష్మి, పిల్లి పుష్ప, నంబూరి పద్మావతి, కుచ్చెర్లపాటి పద్మ, పేరిచర్ల పద్మలత, తోలేటి మాధవి, బైర్రాజు శివనాగరాజు, పిల్లి సూరిబాబు తదితరులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం వద్ద నిరసన తెలిపి మద్యం షాపు తరలించాలని నినాదాలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకుని ఎంపీడీవో ఎం.భారతి వద్దకు వెళ్లి మద్యం షాపు విషయం తెలిపారు. మెయిన్ రోడ్డు నుంచి మార్కెట్‌కు వెళ్లే సబ్ రోడ్డులో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇప్పటికే అక్కడ సారా వ్యాపారం ఎక్కువగా జరుగుతుందని, దానికి తోడు మద్యం షాపు ఏర్పాటు చేశారన్నారు.

శివనామం.. జన్మ పునీతం


బిక్కవోలులోని గొలింగేశ్వర స్వామి


అనపర్తిలో రామలింగేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


చంద్రేడులో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి

పెదపూడి: అనపర్తి మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. అనపర్తి పాత ఊరులో ప్రసిద్ధి చెందిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో తొలి కార్తీక సోమవారం పురస్కరించుకొని వేకువ జాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అర్చకుడు భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో తులసి కోట వద్ద భక్తులు కార్తిక దీపారాధన నిర్వహించారు. స్వామి వారికి లక్షపత్రి పూజ, పంచామృతాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన పార్థివ లింగార్చన, సూర్య నమస్కారాలు నిర్వహించారు.

బిక్కవోలు: కార్తిక మాసం మొదటి సోమవారం కావడంతో ఆలయాల్లో శివనామం మార్మోగింది. బిక్కవోలుశ్రీ గొలింగేశ్వర స్వామి, ఊలపల్లి రోడ్డులోని కేదారేశ్వర స్వామి, కొంకుదురు బుడతల మామిడి వద్ద త్రిముఖ లింగేశ్వర స్వామి, పందలపాకలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి తదితర ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. శివనామాన్ని ఉచ్చరిస్తూ భక్తులు పరవశం చెందారు.

భక్తి శ్రద్ధలతో శివ పూజలు

రంగంపేట: కార్తిక మాసం తొలి సోమవారం పురస్కరించుకొని గ్రామాల్లో శివాలయాలు అందంగా ముస్తాబయ్యాయి. మహాశివుని దర్శించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 4 గంటల నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై దీపాలు వెలిగించి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని వడిశలేరు, పెదరాయవరం, సింగంపల్లి, సుభద్రంపేట, ముకుందవరం, జి.దొంతమూరు గ్రామాల్లోని పురాతన శివాలయాల్లో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్తిక మాసం తొలి సోమవారం పూజలు చేశారు.

'నన్నయ' పోటీలలో క్రీడాకారుల సత్తా

- ప్రథమస్థానంలో తణుకు విద్యార్థులు
- ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకున్న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్


క్రాస్ కంట్రీ పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్



పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన సురేష్‌కు బంగారు పతకం అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు, మహిళల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన నాగలక్ష్మీదుర్గ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజియేట్ క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్ పోటీలలో తణుకు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. మెన్ అండ్ ఉమెన్ విభాగాలలో జరిగిన ఈ పోటీలలో భాగంగా సోమవారం స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద నుంచి కానవరం వరకూ 10 కిలోమీటర్ల పరుగు పందెం పోటీలు జరిగాయి. వీటిని స్పోర్ట్స్ బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ జెండా ఊపి ప్రారంభించారు. యువతీ యువకులు అత్యంత ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొని, నిర్ణీత వ్యవధికి ముందే గమ్యస్థానాన్ని చేరుకునేందుకు కృషి చేశారు. గమ్యాన్ని పురుషుల విభాగంలో ఎస్‌సీఐఎం గవర్నమెంట్ కాలేజీ (తణుకు) విద్యార్థి బి.సురేష్ 36.50 నిమిషాలలో చేరుకుని బంగారు పతకం అందుకున్నాడు. ద్వితీయ స్థానంలో డీఎన్ఆర్‌కాలేజ్ (భీమవరం) విద్యార్థి ఎం. లీలాగణేష్, తృతీయ స్థానంలో ఎస్‌వీ డిగ్రీ కాలేజ్ (భీమడోలు) విద్యార్థి పి.సాయిరామ్ నిలిచారు. వారికి వెండి, కాంస్య పతకాలు అందజేశారు.

మహిళల విభాగంలో..

మహిళల విభాగంలో ఎస్‌కేఎస్‌డీ ఉమెన్స్ కాలేజ్ (తణుకు) విద్యార్థిని బి.నాగలక్ష్మీదుర్గ, ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజ్ (రాజమహేంద్రవరం) విద్యార్థిని వై.కౌశల్య, ఏఎస్‌డీ ప్రభుత్వ కాలేజ్ (కాకినాడ) విద్యార్థిని ఎస్.శిరీష మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరితో పాటు నాలుగు, ఐదు, ఆరు స్థానాలలో నిలిచిన వారికి పతకాలు బహూకరించారు. విజేతలుగా నిలిచిన మెన్ అండ్ ఉమెన్ కేటగిరీలలో 12 మందిని యూనివర్సిటీ టీమ్‌గా ఎంపిక చేశారు. మంగళూర్ యూనివర్సిటీలో ఈ నెల 18 నుంచి జరిగే ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ పోటీలలో వీరు పాల్గొంటారని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు తెలిపారు. అలాగే ఓవరాల్ చాంపియన్ షిప్ విన్నర్‌గా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజ్ నిలిచింది. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయ నిర్మల, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ ఎ.సత్యనారాయణ, డాక్టర్ కె.బాల సత్యనారాయణ, అబ్జర్వర్ డాక్టర్ జి.ప్రమీలారాణి, సెలక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యరూపకం


నృత్యరూప ప్రదర్శన చేసిన కళాకారులతో ఎమ్మెల్యే దంపతులు


పెదపూడి: అనపర్తిలో కూచిపూడి భామాకలాపం నృత్య రూపకంతో పాటు సనాతన ధర్మాలకు చెందిన అంశాలపై ప్రదర్శన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు సోమవారం ప్రారంభించారు. అనపర్తిలోని రామిరెడ్డి మంగయమ్మ కళావేదిక వద్ద శ్రీ రాధాకృష్ణ ట్రస్ట్, టీడీపీ నాయకుడు చింతా ప్రకాశ్‌రెడ్డి అధ్వర్యంలో శ్రీ రాధాకృష్ణ సంగీత, నృత్య కళాక్షేత్రం వారు ఈ ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది.

నైపుణ్య గణన సర్వేపై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

బిక్కవోలు: నైపుణ్య గణన సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు గల వారి వివరాలు 8 విభాగాల ద్వారా సర్వే చేయాలన్నారు. శిక్షకులుగా వ్యవహరించిన పందలపాక డిజిటల్ అసిస్టెంట్–1 సూరి శెట్టి సురేష్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది యానిమేటర్‌లుగా వ్యవహరిస్తారన్నారు.

'వివేకపథం–2025' ఫోల్డర్ ఆవిష్కరణ


భీమవరం కలెక్టరేట్‌లో 'వివేకపథం-2025' ఫోల్డర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

పెదపూడి: భారతదేశ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం కలెక్టరేట్‌లో అనపర్తి శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 'వివేకపథం–2025' పేరిట ముద్రించిన స్వామి వివేకానందుని జీవితం, సందేశం ఫోల్డర్లను సోమవారం కలెక్టర్ నాగరాణి ఆవిష్కరించారు. తొలి ప్రతిని సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డికి అందజేశారు. స్వామి వివేకానంద భావజాల పరివ్యాప్తికి సమితి చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి, తేతలి సుందర రామారెడ్డి, కార్యదర్శులు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసారెడ్డి, మల్లిడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీఓ	ఎస్‌జే ఝాన్సీ	96520 77166
తహసీల్దార్	ఎస్.లక్ష్మీలావణ్య	98499 03900
డిప్యూటీ తహసీల్దార్	ఎ.కుమారి	99491 00395
మండల సర్వేయర్	ఇ.అనిత	81794 14568
మండల సివిల్ సప్లయిస్ డీటీ	గొలుగూరి బాపిరాజు	91823 02929
మండల రీసర్వే డీటీ	బి.క్రాంతి	7382 286190
మండల వ్యవసాయాధికారి	ఎస్‌కే ఇమామి ఖాసిం	83310 56550
మండల ఇంజినీర్	సంపత్ కుమార్	98661 35609
విద్యుత్ శాఖ ఇంజినీర్, రాజానగరం	సుధాకర్	94408 12623
విద్యుత్ శాఖ ఇంజినీర్, సంపత్ నగరం	సత్యప్రసాద్	94408 12627
మండల విద్యాశాఖాధికారి- 1	రామన్నదొర	94409 13928
మండల విద్యాశాఖాధికారి- 2	జ్యోతిప్రసాద్	94401 71896
ఐసీడీఎస్ ప్రాజెక్టు, సీడీపీఓ	టి.నాగమణి	94408 14693
ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) ఏపీఎం	సునీత	79933 25065
గృహ నిర్మాణ శాఖ డీఈ	ఆర్‌వీ బాబు	70939 30566
గృహనిర్మాణ శాఖ ఏఈ	ఏవి రామారావు	70939 30478
సబ్ రిజిస్ట్రార్, రాజానగరం	వెంకటేశ్వరరావు	70939 21434
పోలీసు శాఖ		
రాజానగరం సీఐ	ఎస్‌పీ వీరయ్య గౌడ్	94407 96585
రాజానగరం ఎస్సై- 1	మనోహర్	94932 06031
ఎస్సై- 2	నాగేశ్వర్	94904 91132
బొమ్మూరు సీఐ	కాశీ విశ్వనాథ్	94407 96533